క్లుప్తంగా

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: మండలంలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులంతా సంబంధిత రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఈ–పోస్ యంత్రంలో వేలిముద్రలు వేసి ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే చాలామంది ఈ కేవైసీ వేశారని, ఇంకా 4100 మంది పెండింగ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ–కేవైసీ చేయించుకోని లబ్ధిదారుల కార్డులు రద్దవుతాయని, కాబట్టి లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్ఎన్ లేబరేటరీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 14 మంది అభ్యర్థులు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు రూ. 20 నుండి 25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు 48 మంది అభ్యర్థులు ఎంపికవ్వగా 14 మంది ప్లేస్‌మెంట్లు వచ్చాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, సెక్రటరీ సీతారామరాజు, ట్రెజరర్ రేపాక ప్రవీణ్ భాను, ఏబీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చిట్టిబాబుకు పదవీ విరమణ సత్కారం


చిట్టిబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయులు తరగతికే పరిమితం కాకూడదని తన చుట్టూ ఉన్న సమాజానికి కూడా సేవ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్ర గోపిమూర్తి అన్నారు. బుధవారం స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో సీకరపల్లి చిట్టిబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ చిట్టిబాబు లాంటి మాస్టారు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తన వృత్తిలో భాగంగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఝాన్సీ లక్ష్మీబాయ్, ఎంఈఓ–2 శర్మ, ఉపాధ్యాయులు చిట్టిబాబును ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా ఫెయిర్‌వెల్

నరసాపురం రూరల్: మండలంలోని గొందిమూల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ(ఫెయిర్‌వెల్)ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి విద్యార్థులతో వారికి పాదపూజ చేయించారు. అనంతరం తల్లిదండ్రుల ఔన్నత్యం గురించి విద్యార్థులకు వివరించారు.

వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎస్ఆర్ నగర్‌లో ఓ వ్యక్తి ఇనుపరాడ్డుతో వీరంగం సృష్టించాడు. దుకాణం షట్టరు నుంచి శబ్దం వస్తుందంటూ కె.విజయ ప్రసాద్ అనే వ్యక్తి, దుకాణ యజమాని బొండాడ నర్సింహరావుపై దాడి చేయగా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

చదువుతోపాటు వృత్తి విద్యలో రాణించాలి

కాళ్ల: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కోర్సులను ఎంచుకుని చదువుతో పాటు వృత్తి విద్య లో కూడా రాణించాలని కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం జె.సీతా రామమూర్తి తెలిపారు. కలవపూడి గ్రామంలో ఉన్న వేటుకూరి వెంకట సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. పది రోజులు పాటు నిర్వహించినఈ కోర్సులో వృత్తి నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకున్నారని పేర్కొన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 550 కంటే ఎక్కువ మార్కులతో రికార్డులు


వి.భాస్కర్ సత్య అన్వేష్


జి.ఐశ్వర్య


కె.భవ్యశ్రీ


పీఎస్ శ్రీలేఖ


పి.శరణ్య


జి.చైతన్య


దేవరకొండ అనుశ్రీ


శూల హరి రామచరణ్


చీర్ల జానుశ్రీ


ముళ్లపూడి సిరి దీపిక


రావి అశ్విని


కందెల్లి జోత్స్న


డి.దుర్గాతులసి


ఎ.జశ్వంత్‌కుమార్

పెనుగొండ: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో మండలంలో వడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వీరవాసరపు భాస్కర్ సత్య అన్వేష్ 577 మార్కులు సాధించాడు. పెనుగొండ గురుకుల పాఠశాలకు చెందిన జి.ఐశ్వర్య 556, దేవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.భవ్యశ్రీ సాధించారు. మండలంలో 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు డి.శుభాకరరావు, పి.రామకృష్ణలు తెలిపారు. 484 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయగా 316 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అలాగే పెనుగొండ చైతన్య టెక్నో పాఠశాలకు చెందిన గంట లాస్య నాగ సాయిశ్రీ 589 మార్కులను సాధించడంతో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అభినందించారు.

ఆచంటలో..

పెనుగొండ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆచంట మండల విద్యార్థులుప్రతిభ కనబరిచారు. వల్లూరు ఎంపీ పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీఎస్ శ్రీలేఖ 583, కొడమంచిలిలో హోలీ ఎంజెల్స్ పాఠశాలకు చెందిన పుచ్చకాయల శరణ్య 581, ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరుగోరుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.యువరాజు, వై.గణపతి 577 మార్కులను సాధించారు. మండలంలో మొత్తం 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి పరీక్షా పలితాల్లో పట్టణంలోని బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్ విద్యార్థిని జి.చైతన్య 584 మార్కులతో పట్టణ, మండలంలో టాపర్‌గా నిలిచింది. మండలంలో జెడ్పీ హైస్కూల్ లంకలకోడేరు విద్యార్థిని బీశెట్టి వైశాలి 583 మార్కులే, జెడ్పీ హైస్కూల్ అరట్లకట్ట విద్యార్థిని ఎ.హేమలత 581 మార్కులను సాధించారు. మండలంలో మొత్తం 364 మంది పరీక్షకు 235 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పట్టణంలో మొత్తం 513 మంది హాజరుకాగా 333 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మొత్తం 60 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు. అలాగే మండలంలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 1063 మంది పరీక్షలకు హాజరవ్వగా 1033 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి విద్యార్థులు ముచ్చర్ల దీపిక గౌరి 590, దేవరకొండ అనుశ్రీ 586, సిద్దాని మేఘన 578 మార్కులను సాధించారని డైరెక్టర్ కేవీ కృష్ణవర్మ వివరించారు.

పోడూరు మండలంలో

పాలకొల్లు సెంట్రల్: పదవ తరగతి పరీక్ష పలితాల్లో పోడూరు మండలంలో జిన్నూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వైఎస్సార్ వీర గుప్త 571 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి జి విజయకుమార్ తెలిపారు. బుధవారం విడుదలైన పలితాల్లో గుమ్ములూరు జెడ్పీ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థి పోతాబత్తుల దేవీభవజ్ఞ 561, జిన్నూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బొంతు కీర్తి జ్ఞాన వర్షిత 550 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. మొత్తం 62.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 జీవీ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: పదో ఫలితాల్లో యలమంచిలి మండల విద్యార్థులు నిరాశాజనక ఫలితాలు సాధించారు. మండలంలో మొత్తం 11 జిల్లా పరిషత్ హైస్కూల్స్ నుంచి 553 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 63 శాతంతో 349 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఏనుగువానిలంక హైస్కూల్ విద్యార్థి శూల హరి రామచరణ్ 584 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించగా, మట్లపాలెం పేరిచర్ల సుబ్బరాజు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని చీర్ల జానుశ్రీ 566 మార్కులతో ద్వితీయ స్థానం, దొడ్డిపట్ల హైస్కూల్ విద్యార్థిని ముళ్లపూడి సిరి దీపిక 558 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.అలాగే మేడపాడు సుజాత స్కూల్ నుంచి 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది పాసవ్వగా కాంబొట్లపాలెం ఏవై స్కూల్ నుంచి ఎనిమిది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.


ముచ్చర్ల దీపిక గౌరి


విద్యార్థులను అభినందిస్తున్న పోడూరు ఎంఈఓలు

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. నరసాపురం మండలంలోని నక్కావారిలపాలెం మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని రావి అశ్విని 592 మార్కులు సాధించింది. అలాగే మహాత్మా జ్యోతి బాపూలే ఏపీ బీసీ గురుకుల మత్స్యకార బాలుర పాఠశాల విద్యార్థి సంగాని రోహిత్ 565 మార్కులు సాధించాడు. మండలంలోని యర్రంశెట్టివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తెలగంశెట్టి దీప్తి 580 మార్కులు సాధించగా అదే పాఠశాలలో కొండా నరేంద్రకుమార్ 562 మార్కులు సాధించారు. మున్సిపల్ టేలర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మహ్మద్ నజియా 576, పట్టణంలోని మిషన్ హైస్కూల్ విద్యార్థిని కె.శ్రావ్య 549 మార్కులు సాధించారని, ఎంఈఓ పుష్పరాజ్యం తెలిపారు. కొప్పర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 547 మార్కులు సాధించి పాఠశాల ప్రథమస్థానంలో నిలచిన విద్యార్థిని మంకు దివ్యను దివంగత యూటీఎఫ్ నాయకులు యస్ ఆర్ పోలిశెట్టి గారి జ్ఞాపకార్థ వారి కుటుంబ సభ్యులు రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించి అభినందించారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 365 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయగ 254 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి ఉంగరాల నాగేశ్వరావు తెలిపారు. మండలంలో జుత్తిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కండెల్లి జోత్స్న 578 మార్కులు, పాలమూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు చెందిన దారపురెడ్డి దుర్గ తులసి 577 మార్కులు, నెగ్గపూడి లోని బాలుర గురుకుల పాఠశాల చెందిన అమీరపు జస్వంత్ కుమార్ (పెనుమంత్ర)577 మార్కులు సాధించారని వివరించారు. మార్టేరు వివేకానందలో పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామని, చెల్లబోయిన ప్రణీత 589 కొవ్వూరి సింధు భవిత 582 మార్కులు సాధించారని డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

నరసాపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నరసాపురం శ్రీసూర్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభకనరిచారు. 17 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. పాఠశాలలో నిర్వహించిన అభినందిన కార్యక్రమాంలో ఆర్డీవో పాల్గొన్నారు. ద్వారా అమృతమణి 593, అందే ప్రసన్న 588 మార్కులు, పులపర్తి హిమహాసిని 587 మార్కులు, పొన్నపల్లి హితేష్ 575 మార్కులు, జనపరెడ్డి లిఖిత ఆదిత్య 574 మార్కులు, రావూరి నిఖిల హరిప్రియ 569 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులతో సత్తాచాటిన విద్యార్థులను ఆర్డీఓ పాటుగా పాఠశాల డైరెక్టర్ ఘంటశాల హేమవల్లి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సతీష్ తదితరులు అభినందించారు.


శ్రీసూర్యా విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

ఆదిత్య పాఠశాలలో..

నరసాపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నరసాపురం ఆదిత్య పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో ఆదిక్యత చూపించారని ఆదిత్యా విద్యాసంస్థల డైరెక్టర్లు ఎస్.శృతిరెడ్డి, ఎస్వీ రాఘవ రెడ్డి చెప్పారు. కట్టా సాయిరత్నశ్రీవల్లి వర్షిణి 594 మార్కులు, రావూరి గణేష్ 586, సయ్యద్ ఫరీదా 585, దోసుల కరుణ 584, షేక్ సనా 582 మార్కులను సాధించారన్నారు. 25 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించినట్టు వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కర్ణా రాజేష్, ఆదిత్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.శివకోటప్రసాద్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య ఉపాధ్యాయులు

స్వర్ణాంధ్రలో పేటెంట్ హక్కుపై వర్క్‌షాపు

నరసాపురం రూరల్: ఒక ఆవిష్కరణను తయారు చేసి చట్టపరమైన హక్కును పొందడమే పేటెంట్ అని విశాఖ పట్టణానికి చెందిన నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ యస్‌వీఏఎన్ రాజ్ అన్నారు. మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐటీసీ) వారి ఆధ్వర్యంలో పేటెంట్ హక్కులపై ఒక్కరోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారు నిర్వహించే ప్రాజెక్ట్స్, నూతన ఆలోచనా విదానాలను పేటెంటింగ్‌లా ఎలా మలచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, డైరెక్టర్ అద్దాల శ్రీహరి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎయస్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యస్‌వీఏఎన్ రాజ్.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

యలమంచిలి: గ్రామ దేవత మూలస్థానేశ్వరీ దేవి (ముంతాలమ్మ) అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం తాళ్లూరి శ్రీనివాస్ (వైజాగ్ బుజ్జి), శిరీష దంపతులు శంకుస్థాపన చేశారు. వీరితో అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెనికేరుకు చెందిన అర్చకులు ప్రసాద్‌శర్మ శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేయించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి వైజాగ్ బుజ్జి దంపతులు రూ.9 లక్షలు, తమ్మినీడి సర్వరాయ చక్రవర్తి దంపతులు రూ.9 లక్షలు, చిలుకూరి వెంకట ఫణి దుర్గా రామ్‌ప్రసాద్ దంపతులు రూ. 5 లక్షలు విరాళం ప్రకటించారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు.


ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తాళ్లూరి శ్రీనివాస్, శిరీష దంపతులు

జెడ్పీ పాఠశాల పరిశీలన

పెనుగొండ: మండలంలోని చెరుకువాడ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్యామ్ సుందర్ బుధవారం పరిశీలించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దత్తత గ్రామమైన పెనుగొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి వినతులు అందడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పాఠశాల అభివృద్ధికి అంచనాలు వేయడానికి పరిశీలించామని ఏపీసీ శ్యాంసుందర్ తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు నివేదిక అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.శుభాకరరావు, పి.రామకృష్ణ, హెచ్ఎం పి.భరణీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చెరుకువాడలో జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్ సుందర్

ఎస్సీ వర్గీకరణపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు గవర్నర్ ఆమోదం తెలపడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన బాబు అన్నారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద వర్గీకరణ బిల్లుకు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేసి మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పసల బోసు, నందబాబు, ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

నరసాపురం రూరల్: మండలంలోని పేరుపాలెం బీచ్ వద్దకరు ఆత్మహత్య చేసకోవడానికి వచ్చిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వచ్చాడని డయల్ 112కు బుధవారం ఓ ఫోన్ వచ్చింది. స్పందించిన మొగల్తూరు ఎస్సై జి.వాసు సదరు వ్యక్తిని పేరుపాలెం బీచ్లో గుర్తించి ఔట్‌పోస్టులో విధుల్లో ఉన్న సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.